బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఓబీసీ మోర్చా నాయకులతో కలిసి అంబర్‌పేట తాసీల్దార్ మీరాబాయికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ నాయకులు వినోద్‌యాదవ్, కృష్ణాగౌడ్, రమేశ్‌యాదవ్, భిక్షపతి, కార్పొరేటర్ అమృత, అజయ్ కుమార్, శ్యాంరాజ్, నాగభూషణంచారి, రవీందర్‌గౌడ్, మైలారం రాజు, అచ్చిని రమేశ్ పాల్గొన్నారు.

- గోల్నాక

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయకపోవడంపై నిరసన తెలుపుతూ కార్వాన్ నియోజకవర్గం బీజేపీ బీసీ మోర్చా ఆధ్వర్యంలో గోల్కొండ తాసీల్దార్ డి. అహల్యకు బీజేపీ బీసీ నాయకులు దేవర వంశీ, సుధాకర్ యాదవ్ వినతిపత్రం సమర్పించారు. అధికారంలోకి వస్తే 6 నెలల్లోపు బీసీల కులగణన చేసి రిజర్వేషన్లు పెంచుతామని, ఇప్పుడు బీసీల పేరు ఎత్తకపోవడం దారుణమన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైందన్నారు. కార్యక్రమంలో బీజేపీ బీసీ మోర్చా నాయకులు ముఖేశ్‌సాగర్, సందేశ్‌యాదవ్, ప్రభు పూజారి పాల్గొన్నారు.

- కార్వాన్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక సాయం

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, జూలై 22 : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సోమవారం గోల్నాక లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద 10మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.3,90,000 విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యానికి గురై దవాఖానల్లో చికిత్స పొందుతున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బి. పద్మావెంకట్ రెడ్డి, విజయ్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

పూజారులకు గౌరవవేతనం అందజేత

ఆలయాల్లో ప్రతిరోజూ దూపదీప, నైవేద్యం సమర్పిస్తున్న పేద పూజారులకు ప్రతి నెలా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గౌరవవేతనం అందజేస్తున్న విషయం తెలిసిందే.. సోమవారం గోల్నాక క్యాంపు కార్యాలయంలో ఈ నెలకు సంబంధించి 11 మంది పూజారులకు రూ. 5 వేల చొప్పున మొత్తం రూ.55 వేలు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా పూజారులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బి.పద్మావెంకట్‌రెడ్డి, విజయ్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

- గోల్నాక

మైసమ్మ బోనాలకు రావాలని ఆహ్వానం

బాగ్‌అంబర్‌పేట డివిజన్ మైసమ్మ గుడిలో ఈ నెల 28, 29 తేదీలలో జరిగే బోనాలకు రావాలని కోరుతూ దేవస్థాన సేవా సమితి చైర్మన్ కోట్ల శివకుమార్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్లు బి.పద్మావెంకటరెడ్డి, ఇ.విజయ్‌కుమార్‌గౌడ్‌లను సోమవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

- అంబర్‌పేట

లాల్‌దర్వాజ అమ్మవారికి పట్టువస్త్రాలు

లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారికి గోల్కొండ బోనాల కులవృత్తుల సంఘం ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బి. సాయిబాబాచారి, సభ్యులు శివరాజ్, సోను, శ్రీకాంత్ చారి, పూజారి సురేశ్ చారి తదితరులు పాల్గొన్నారు.

- మెహిదీపట్నం

వైభవంగా అమ్మవారి ఘటం ఊరేగింపు

ఆషాఢ బోనాలను పురస్కరించుకుని ముషీరాబాద్‌లో మహంకాళి అమ్మవారి ఘటం ఊరేగింపును సోమవారం వైభవంగా నిర్వహించారు. బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ అమ్మవారి ఘటానికి పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, చైర్మన్ రెబ్బ రామారావు, సంగిశెట్టి రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకుడు శివముదిరాజ్, దీన్‌దయాల్ రెడ్డి పాల్గొన్నారు.

- చిక్కడపల్లి

'హగ్ ది నేచర్' శిక్షణా శిబిరం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సునీల్ సింగాడే , గున్న రాజేందర్‌రెడ్డి, ప్రకృతి వైద్యులు డాక్టర్ పద్మ, డాక్టర్ కేవై రామచంద్రం

సుల్తాన్‌బజార్, జూలై 22 : ఆయిస్టర్, సేవ్ ఆర్త్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ప్రకృతి ఒడిలో అనుభవాలు పంచుకుందాం(హగ్ ది నేచర్) శ్రీ రామచంద్ర ప్రకృతి ఆశ్రమంలో మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగాడే అన్నారు. వినోబా డెవలప్‌మెంట్ సొసైటీ గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ.. సౌజన్యంతో ఆయిస్టర్, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ల ధ్వర్యంలో 25 నుంచి 27 వరకు నిర్వహించతలపెట్టిన శిక్షణ శిబిరం పోస్టర్‌ను సోమవారం వినోబానగర్‌లోని ఆశ్రమంలో గాంధీ సంస్థల చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి, ప్రకృతి వైద్యులు డాక్టర్ పద్మ, డాక్టర్ కేవై రామచంద్రంతో కలిసి ఆవిష్కరించారు. ఈ మూడు రోజుల శిక్షణ శిబిరానికి కావలసిన వసతులు భోజన సదుపాయాన్ని సమకూరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకో వాలని ఆకాక్షించారు.ఈ కార్యక్ర మంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ వై ప్రభాకర్‌రెడ్డి,సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ టి. సురేందర్ ఆశ్రమం ఇన్‌చార్జి కానుగుల శ్రీకాంత్, ఆయిస్టర్ సంస్థ ప్రతినిధులు వైష్ణవి, గోపి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక నాట్యరంగ కార్యవర్గం

కర్ణాటక నాట్యరంగానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు, మాజీ అధ్యక్షుడు బీఆర్ రావు, శ్రీధర్‌రావు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా మంజా కృష్ణ మూర్తి, ఉపాధ్యక్షులుగా రత్నాకర్‌రాయి, సుమతి నిరంజన్, చీఫ్ లైజన్ అధికారిగా విత ల్‌జోషి, కార్యదర్శిగా రామచంద్ర డిజ్జి, జాయింట్ కార్యదర్శిగా హరిశ్ పస్‌పుల్లా, కోశాధిరిగా వి.రాంచందర్‌రావు, న్యాయ సలహాదారునిగా గోపాల్‌కృష్ణ, అడిటర్‌గా నరేంద్రతో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. – కాచిగూడ, జూలై 22

ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముషీరాబాద్ నియోజకవర్గం ఓబీసీ మోర్చా కన్వీనర్ ఉమేశ్ డిమాండ్ చేశారు. బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సోమవారం బాగ్‌లింగంపల్లి కార్యాలయంలో తాసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం ఇచ్చారు. జాతీయ బీసీ మోర్చాకార్యవర్గ సభ్యులు పూసరాజు, నందనం దివాకర్, బండారు విజయలక్ష్మి, నాయకులు శైలేంద్ర శ్రీనివాస్ యదవ్, మహేందర్ బాబు, సాయిచంద్, నరేశ్, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

- చిక్కడపల్లి

సిటిజన్ కౌన్సిల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎట్టయ్య

కాచిగూడ / కార్వాన్, జూలై 22: తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా హైకోర్టు న్యాయవాది గద్దగూటి ఎట్టయ్య ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం బర్కత్‌పురలోని సిటిజన్ కౌన్సిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎట్టయ్యకు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌నారాయణ మూదిరాజ్ నియామకపు పత్రాన్ని అందజేశారు.

ఇబ్బందులు లేకుండా చూడండి

ప్రజలకు వర్షాల వల్ల ఇబ్బందులు లేకుండా చూడాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. సోమవారం టోలిచౌకిలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. వర్షాల కారణంగా రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

- మెహిదీపట్నం

సమస్యల పరిష్కారమే ధ్యేయం

చార్మినార్, జూలై 22 : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిని నిర్వహిస్తున్నామని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. సోమవారం జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన వినతులపై ఆయన వివిధ విభాగాల అధికారులకు తగిన ఆదేశాలను జారీ చేశారు. సంతోషినగర్ సర్కిల్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద అడ్డదిడ్డమైన పార్కింగ్ వ్యవస్థ నెలకొని ఉందని స్థానికులు ఫిర్యాదు చేశారని, దానిపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శైలజ, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనా బి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ రాజారావు,. ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేశ్ పాల్గొన్నారు.

'లలితావిష్ణు వైభవం' నిత్య పారాయణ గ్రంథావిష్కరణ

చిక్కడపల్లి, జూలై 22 : ఆధ్యాత్మికవేత్త పురానపండ శ్రీనివాస్ రచించిన 'లలితావిష్ణు వైభవం' గ్రంథావిష్కరణ సభ సోమవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కె.వి.రమణ చారి హాజరై ఆవిష్కరించారు. అధ్యక్షతన వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి మాట్లాడుతూ.. ఈ గ్రంథాన్ని ముషీరాబాద్ శృంగేరి సరస్వతి దేవాలయంలో భక్తులకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. బైసా దేవదాస్, పొత్తూరి సుబ్బారావు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సినారె పదాలు అజరామరం

రసమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కారగ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతిని నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. సినారె పురస్కారాన్ని ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు ప్రదానం చేశారు. టీఎస్‌ఐడీసీ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కె.వి. రమణాచారి, డాక్టర్ రమ్యారావు సినారె సాహిత్యం, రచనాశైలిని వివరించారు. రసమయి అధ్యక్షుడు డాక్టర్ ఎం.కె రాము పాల్గొన్నారు. సినారె పాటలను గాయకులు ఆలపించి ఆలరించారు.

- తెలుగు యూనివర్సిటీ

25,26 తేదీల్లో.. స్టైల్ పితార ఎగ్జిబిషన్

మహిళలు, గృహిణులు అన్నిరంగాల్లో ఉన్నతంగా ఎదిగేందుకు 8 ఏండ్లుగా క్రియేటివ్ ఆర్ట్స్ స్టైల్ పితార చారిటి సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధులు రమా రాఠి, వైశాలి ఇనాని, మీనల్ శారద, వినీత బల్దువ పేర్కొన్నారు. సోమవారం కోఠిలోని సంస్థ కార్యాలయంలో వారు 25, 26 తేదీల్లో నిర్వహించబోయే స్టైల్ పితార లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎగ్జిబిషన్‌ను సంఘ సేవకురాలు భగవతి మహేశ్ బల్దువ, ఐవీఎఫ్ వైద్యురాలు శ్వేత అగ్రవాల్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభిస్తారన్నారు.

- సుల్తాన్‌బజార్

బజరంగ్ సేనలోకి జాతీయ రెజ్లర్ రూప్‌లాల్

జాతీయ స్థాయి రెజ్లర్ రూప్‌లాల్ బజరంగ్ సేనలో చేరారు. తెలంగాణ అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో సోమవారం పార్టీ కార్యాలయంలో చేరారు. ఈ సందర్భంగా బజరంగ్ సేన కార్యక్రమాలకు ఆకర్షితుడినై ఇందులో చేరుతున్నట్లు రూప్‌లాల్ తెలిపారు. సేన ప్రధాన కార్యదర్శి ఠాకూర్ వికాస్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ యర్రం శ్రీనివాస్, ప్రవీణ్‌యాదవ్, కరణ్ సూర్యవంశీ, నరేశ్ ఆయనకు బొకే ఇచ్చి స్వాగతం పలికారు. దీపక్, నరేశ్, చిన్నా, అభిషేక్ వీరూ పాల్గొన్నారు.

- కాచిగూడ

పార్కులోని సమస్యలు పరిష్కరించండి

సీఈ కాలనీ సమస్యలపై ఈఈ పేర్‌రాజుతో చర్చిస్తున్న కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి

అంబర్‌పేట, జూలై 22 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధిలోని సీఈ కాలనీ పార్కులోని సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఈఈ పేర్‌రాజుకు చెప్పారు. కాలనీ ప్రధాన కార్యదర్శి పడాల వెంకట్రావు, ఈఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవితో కలిసి సోమవారం పార్కును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో పాత్‌వే, షెడ్డు, పార్కు గేటు, షటిల్ కోర్టులో మట్టిని పోయడం, చిన్నపిల్లలకు కావాల్సిన ఆటపరికరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇంకా పార్కులో సమస్యలుంటే కూడా వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సి.హెచ్. చంద్రమోహన్, నాయకులు మిర్యాల శ్రీనివాస్, టి.రమేశ్, గోవిందు పాల్గొన్నారు.

ప్లాట్‌ఫారంపై వ్యక్తి మృతి

కాచిగూడ, జూలై 22 : ప్లాట్‌ఫారంపై వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వేస్టేషన్‌లో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన దేముడు కుమారుడు సత్యనారాయణ మేస్త్రీ. సోమవారం కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం నాలుగులో అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని సెక్యూరిటీ గార్డు ..

రైలు ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం ప్రకారం.. ఆరాంఘర్‌కు చెందిన కమలేశ్‌కుమార్ సింగ్ సెక్యూరిటీ గార్డు. సోమవారం బుద్వేల్– శివరాంపల్లి రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోవాకు వెళ్లిన ఇద్దరు సోదరులు

రైల్వే స్టేషన్‌లో తిరుగుతుండటంతో పట్టుకున్న పోలీసులు

సిటీబ్యూరో, జూలై 22 (నమస్తే తెలంగాణ): ఇంట్లో చెప్పకుండా గోవాకు వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు ఇంటికి వెళ్తే కుటుంబ సభ్యులు తిడతారని ఆందోళనతో రైల్వే స్టేషన్ వద్దనే ఉండటంతో డబీర్‌పురా పోలీసులు వారిని గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. సౌత్‌ఈస్ట్‌జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ కథనం ప్రకారం.. బోయిని చంద్రయ్య, వెంకటయ్య అన్నదమ్ములు వాళ్ల పిల్లలు బోయిని వినయ్‌కుమార్, బోయిని యాదగిరి ఈ నెల 6వ తేదీన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్తున్నామని ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు డబీర్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే వారి కోసం ఎస్సై శ్రీధర్ బృందం గాలిస్తుండడంతో కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించడంతో తాము గోవాకు వెళ్లాలని అనుకున్నామని కుటుంబ సభ్యులు నిరాకరించడంతో ఇంట్లో చెప్పకుండా గోవా వెళ్లి వచ్చామని చెప్పారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

చిక్కడపల్లి, జూలై 22 : విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ అన్నారు. అవంతి డిగ్రీ, పీజీ కళాశాల నూతన విద్యార్థులకు సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ప్రతిష్ట'–2024 పేరట అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. స్మార్ట్ ఫోన్‌లకు బానిసలు కాకుండా అవసరాన్ని బట్టి వాటిని వినియోగించుకోవాలని, సోషల్ మీడియా దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అవంతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ఎం.శ్రీనివాస్‌రావు, డాక్టర్ పి. మురళీధర్‌రెడ్డి, విద్యావేత్త శైలజ అక్కల, రామకృష్ణమఠ్ ప్రతినిధి బ్రహ్మచారి సత్యచైతన్య స్వామిజీ, అవంతి విద్యాసంస్థల అధ్యక్షురాలు ఎం.జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

చిక్కడపల్లి,జూలై 22: తుల్ క్యాంప్ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్‌లో హైదరాబాద్ గ్రూప్ చాంపియన్‌షిప్ గెలుపొందింది. బాగ్‌లింగంపల్లి అంబేద్కర్ కాలేజ్ ఎన్‌సీసీ విద్యార్థి వంశీసాగర్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. తెలంగాణ బెటాలియన్ నుంచి పోటీ చేసిన విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారు. క్యాంప్‌లో సత్తా చాటిన విద్యార్థులను సోమవారం సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కమాడింగ్ ఆఫీసర్ ఆఫీసర్ ప్రసన్‌నాథ్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

రీవాల్యూయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 22: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ లాంగ్వేజెస్, ఎంఏ లాంగ్వేజెస్, ఓఎల్‌సీసీ, పీడీసీ తదితర కోర్సుల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మార్కుమెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి, ఈ నెల 26లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 30వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 30 లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చన్నారు.

నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి, రెండో సంవత్సరం బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 26 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.10 వేల చొప్పున చెల్లించి ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్

కార్వాన్, జూలై 22 : పండుగలు స్నేహ భావానికి ప్రతీకలని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్ర మోహన్ అన్నారు. 27 నుంచి 29 వరకు నిర్వహించే బోనాల ఉత్సవాల కోసం తీసుకోవాల్సిన పటిష్ట బందోబస్తు చర్యల గురించి సోమవారం కార్వాన్‌లోని ఎం.కె. ఫంక్షన్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీపీ .. బోనాలను ప్రతి ఒక్కరూ సంతోషంగా నిర్వహించుకోవాలని అన్నారు. పండుగను పురస్కరించుకొని రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారిపై నిఘా ఉంచినట్లు తెలిపారు. పండుగ సమయంలో గొడవలు సృష్టించాలనుకునే వారిపై ఉక్కుపాదం మోపి కఠిన చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ అశ్వాక్, కుల్సుంపురా ఏసీపీ మునావర్ అలీ, గోల్కొండ ఏసీపీ ఫయాజ్, టప్పాచబుత్రా ఇన్‌స్పెక్టర్ రాములు, కార్వాన్ డివిజన్ కార్పొరేటర్ ఎం. స్వామి యాదవ్, దత్తాత్రేయ నగర్ డివిజన్ కార్పొరేటర్ జాక్రి బాక్రి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు .

జేపీఎల్ షురూ..

హైదరాబాద్, ఆట ప్రతినిధి : కేఏస్‌జీ జర్నలిస్టు ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) సీజన్–1 పోటీలు సోమవారం అట్టహాసంగా మొదలయ్యాయి. ఆరాంఘర్‌లోని విజయానంద్ గ్రౌండ్స్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో 10 టీవీపై టీవీ9 ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన 10టీవీ 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి గాను 116 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్య ఛేదనలో టీవీ9 రెండు వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. కెప్టెన్ సాయికిశోర్(69) 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఈ మ్యాచ్‌కు త్రుక్ష ఫుడ్స్ ఎండీ భరత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో ఎన్‌టీవీ 58 పరుగులతో సాక్షి టీవీపై ఘన విజయం సాధించింది.

జింఖానా స్టేడియంలో డ్రెస్సింగ్‌రూమ్ ఆధునీకరణ

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) సికింద్రాబాద్ జింఖానా క్రికెట్ స్టేడియంలో మహిళల డ్రెస్సింగ్‌రూమ్‌ను పూర్తిగా ఆధునీకరించారు. మహిళా క్రికెటర్ల సౌకర్యార్థం డ్రెస్సింగ్‌రూమ్‌తో పాటు దానికి అనుబంధంగా ఉన్న ఎనిమిది చేంజింగ్ రూమ్స్‌కు మరమ్మతులు చేశారు. వీటిని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, కౌన్సిలర్ సునీల్ అగర్వాల్, హెచ్‌సీఏ సీనియర్ మెంబర్ ఆగమ్ రావు, అకాడమీ డైరెక్టర్ విజయ్‌మోహన్ ప్రారంభించారు.

బోనాలకు విచ్చేయండి

పాతనగరంలో ఆదివారం నిర్వహించనున్న బోనాలకు రావాలని కోరుతూ ఉప్పుగూడ మహంకాళి అమ్మవారి దేవస్థాన ప్రతినిధులు ప్రభుత్వ సలహాదారు జగ్గారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జనగామ మధుసూదన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కీర్తి నరేందర్ ముదిరాజ్ కార్యదర్శులు సతీశ్, ప్రదీప్, ఆనంద్ పాల్గొన్నారు.

- చార్మినార్

గోశాల ప్రారంభం

గోమాత సేవకు ముందుండాలని గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ అన్నారు. హైదరాబాద్ ఆర్య వైశ్య యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో రహీంపురాలోని దత్తాత్రేయ మందిర్ బాబా గోవింద్ దాస్ మఠంలో నిర్మించిన నూతన గోశాలను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. గోశాలను నిర్మించిన వైశ్య ప్రతినిధులను అభినందించారు. సంఘం తెలంగాణ అధ్యక్షుడు మాడిశెట్టి సదానందంగుప్తా, ఆర్య వైశ్య ప్రతినిధులు నరేశ్‌గుప్తా పాల్గొన్నారు.

- కార్వా